# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా గణిత దినోత్సవం

### ఆమాట్ టాపర్లకు సన్మానం.. ఆకట్టుకున్న గణిత ప్రదర్శనలు




జనతా న్యూస్, కరీంనగర్: కొత్తపల్లి పరిధిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే కార్యక్రమాలతో పాటు ఆమాట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేశారు. వేడుకల ప్రారంభానికి ముందు పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రామానుజన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం గణిత అవధాని ఈ. చంద్రయ్య మాట్లాడుతూ గణిత శాస్త్రం జీవితాన్ని ప్రభావితం చేసే కీలక విజ్ఞానమని తెలిపారు. చిన్ననాటి నుంచే గణితంపై ఆసక్తి పెంపొందించుకున్న రామానుజన్ పరిశోధనాత్మక దృక్పథంతో ప్రపంచానికి వినూత్న సూత్రాలను అందించారని పేర్కొన్నారు. నేటికీ అనేక సూత్రాలకు పరిష్కారాలు లభించకపోవడం ఆయన మేధస్సుకు నిదర్శనమని అన్నారు.రామానుజన్ జీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని, అంకితభావం, ఏకాగ్రతతో సాధన చేస్తే కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంచే విధంగా అల్ఫోర్స్ విద్యాసంస్థలు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని అభిప్రాయపడ్డారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గణితం ద్వారా వివిధ స్థాయిల్లో నిర్వహించే పోటీ పరీక్షల్లో విజయాలు సాధించవచ్చని తెలిపారు. క్రమబద్ధమైన సాధన, ఏకాగ్రత ఉంటే గణితంలో అద్భుత ఫలితాలు సాధించడంతో పాటు మంచి అవకాశాలు కూడా లభిస్తాయని చెప్పారు. గణిత ప్రతిభా పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడం సంస్థ లక్ష్యమని వెల్లడించారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రామానుజన్ జీవితం ఆధారంగా రూపొందించిన నాటిక ఆలోచింపజేసింది. అలాగే చంద్రయ్య ప్రదర్శించిన గణిత అద్భుతాలు విద్యార్థులను ఉత్సాహపరిచాయి. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన గణిత ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మ్యాథ్స్ క్విజ్, టాంగ్రామ్, గణిత%-%ఏఐ నమూనాలు, డిజిటల్ కొలతలు, గోల్డెన్ రేషియో, పాస్కల్ త్రిభుజం, రామానుజన్ సంఖ్య వంటి అంశాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.




ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, గణిత ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి పట్టణంలో అభివృద్ధి పనుల పరిశీలన

### తాగునీటి ట్యాంకులు, రోడ్లు, డ్రైనేజీ పనులపై ఎమ్మెల్యే సమీక్ష



పెద్దపల్లి,జనతా న్యూస్ : పెద్దపల్లి పట్టణంలో కొనసాగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు సోమవారం పరిశీలించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరాకు సంబంధించిన పనుల పురోగతిపై అధికారులు, స్థానిక నాయకులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా రంగంపల్లి 10వ వార్డులోని క్రిస్టియన్ స్మశాన వాటిక వద్ద రూ.52 లక్షల నిధులతో చేపట్టనున్న ప్రహరీ గోడ, మురికి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సుభాష్ నగర్ 27, 28వ వార్డులలో శ్రీనిక హాస్పిటల్ నుంచి సుభాష్ నగర్ చౌరస్తా వరకు రూ.93.51 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణం, విద్యుత్ స్తంభాల మార్పు పనులను పరిశీలించారు. అలాగే పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమీపంలో రూ.2.95 కోట్లతో నిర్మించనున్న 1700 కిలోలీటర్ల సామర్థ్యం గల నూతన ఆర్‌సీసీ ఈఎల్ఎస్ఆర్ నీటి ట్యాంక్ పనులను, చందపల్లిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో రూ.103 లక్షలతో నిర్మిస్తున్న 500 కిలోలీటర్ల సామర్థ్యం గల మరో నీటి ట్యాంక్ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సరఫరా మెరుగుపర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వివిధ వార్డుల్లో అవసరాన్ని బట్టి నిధులను వినియోగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కొనసాగుతున్న పనులను నిర్ణీత గడువులో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ్ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంక్ లక్ష్యంగా చర్యలు

### కరీంనగర్ నగరపాలక సంస్థ అధికారులతో సీడీఎంఏ సమీక్ష



కరీంనగర్, జనతా న్యూస్: 2025%-%26 స్వచ్ఛ్ సర్వేక్షన్‌లో కరీంనగర్ నగరపాలక సంస్థ మెరుగైన ర్యాంక్ సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీడీఎంఏ అధికారి శ్రీదేవి సూచించారు. హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం నుంచి జూమ్ సమావేశం ద్వారా కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సమక్షంలో పారిశుధ్య విభాగం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ్ సర్వేక్షన్ మార్గదర్శకాలను అధికారులు క్షుణ్ణంగా పాటించాలని, ప్రతి పారామీటర్‌కు అనుగుణంగా గరిష్ట మార్కులు సాధించేలా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సీడీఎంఏ అధికారి సూచించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణతో పాటు తడి-పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియను మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. కంపోస్ట్ ఎరువు తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని, డీఆర్‌సీసీల నిర్వహణను మెరుగుపరచడంతో పాటు వాటి సంఖ్యను పెంచాలని సూచించారు. ఎస్‌టీపీని ఆధునీకరించడం, ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వంద శాతం బయో మైనింగ్ ప్రక్రియ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు హోం కంపోస్టింగ్‌ను ప్రోత్సహించాలని, పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లను ఒకే వ్యవస్థలోకి తీసుకురావాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తప్పనిసరిగా పరిష్కరించాలని తెలిపారు. డంపింగ్ యార్డుల్లో రోడ్లు నిర్మించాలని, స్వచ్ఛ్ ఆటోలకు స్పష్టమైన రూట్ మ్యాప్ రూపొందించి దాని ప్రకారమే చెత్త సేకరణ జరిగేలా చూడాలని ఆదేశించారు. స్వచ్ఛ్ ఆటోలకు జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరిగా అమలు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. నగరంలో కంపోస్ట్ యూనిట్ల సంఖ్యను పెంచాలని కూడా పేర్కొన్నారు. రోడ్లపై, పరిసర ప్రాంతాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను సక్రమంగా చేపట్టి పరిశుభ్రతను కాపాడాలని సీడీఎంఏ అధికారి ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, స్వచ్ఛ్ సర్వేక్షన్‌లో కరీంనగర్‌కు మంచి ర్యాంకు తీసుకురావడం లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణలో వంద శాతం చెత్త వేరు చేసే విధానం అమలయ్యేలా చూడాలని, ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

# సర్పంచులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి అభినందనలు



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలో నూతన ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్ అశోధ శ్రీనివాస్, ఉప సర్పంచ్ నీలం ఓదెలు తో పాటు పాలకవర్గాన్ని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పూలమాలను వేసి సాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో అందరూ ఐక్యంగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. తిమ్మాపూర్ మండలంలో మహాత్మా నగర్, తిమ్మాపూర్, నుస్తులాపూర్, పోలంపల్లి, నర్సింగపూర్ గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులను, ఉప సర్పంచులను, వార్డు సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. ఎమ్మెల్యే వెంట తహసిల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా, కాంగ్రెస్ నాయకులు శ్రీగిరి రంగారావు ఉన్నారు.

# కొలువుదీరిన కొత్త పాలకవర్గం

### సమస్యలతో స్వాగతం పలికిన గ్రామాలు.

### బాపూజీ కలలు కన్నా గ్రామ సీమాలను ఆశిస్తున్న ఆయా గ్రామాల ప్రజలు.



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలో రెండవ విడత ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సోమవారం పాలనా బాధ్యతలను చేపట్టడం జరిగింది. ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు వారిచే ప్రమాణ స్వీకరణ చేయించి పాలనా బాధ్యతలను అప్పగించడంతో, నూతన కార్యవర్గం పాలనా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. గ్రామాలలో రెండు సంవత్సరాల నుండి పాలకవర్గం లేకపోవడంతో, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి రావలసిన నిధులు రాక గ్రామాలలో అభివృద్ధి స్తంభించడంతో, పల్లెల్లో సమస్యలు పేరుకొని పోయినాయి, పేరుకుపోయిన సమస్యలతోనే ఆయా గ్రామాలు నూతన కార్యవర్గానికి స్వాగతం పలకడంతో, సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాలను అభివృద్ధి, సంక్షేమ దిశలో నడిపించే బృహత్తర బాధ్యత కొత్త పాలకవర్గం చేతుల్లో ఉంది. ఇప్పటికైనా పల్లెలు బాపూజీ కలలు కన్నా గ్రామ సీమాలుగా వికసిల్లుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# మాస్టర్ ప్లాన్ అభ్యంతరాలు, సూచనలపై సమీక్ష

### ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు కమిషనర్ ఆదేశం

కరీంనగర్, జనతా న్యూస్: శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (SUDA) ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్‌పై పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా SUDA సీపీఓ ఆంజనేయులు పాల్గొని, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలపై ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలపై విస్తృతంగా చర్చించారు. పౌరుల నుంచి అందిన అభ్యంతరాలు, సూచనలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో పారదర్శకతను పాటించాలని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూనే నగర సమగ్ర అభివృద్ధికి అనువైన ప్రణాళికలు రూపొందించాలని కమిషనర్ సూచించారు. అభ్యంతరాల పరిష్కారంలో స్పష్టత ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన డీసీపీ మహమ్మద్ బషీర్, ఏసీపీలు టి. వేణు, శ్రీధర్, టీపీఎస్ అధికారులు జి. తేజస్విని, సంధ్య, రాజ్ కుమార్‌తో పాటు టీపీబీఓలు తదితరులు పాల్గొన్నారు.

# యువతను ఉత్సాహపరిచిన నూతన సర్పంచులు

### బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ.



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని బేగంపేట గ్రామంలో యువకులు బెజ్జంకి సంపత్, బెజ్జంకి సతీష్ అనే యువకులు స్వయం ఉపాధి కోసం శ్రీ విజేత టెంట్ హౌస్ ను ఉపాధి మార్గంగా ఎంపిక చేసుకొని సోమవారం ప్రారంభోత్సవ కార్యక్రమా నికి నూతన బాధ్యతలు స్వీకరించిన బేగంపేట గ్రామ సర్పంచ్ ఎల విజయ శ్రీనివాస్, కళ్ళే పెల్లి సర్పంచ్ బిగుల్ల మోహన్ లను ఆహ్వానించడంతో, ఎంతో బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ యు-వతను ఉత్సాహపరచాలని ఉద్దేశంతో, యువకుల విన్నపాన్ని స్వీకరించి టెంట్ హౌస్ ప్రారంభోత్సవంలో పాల్గొని స్వయం ఉపాధి పట్ల యువతను ప్రోత్సహించిన తీరును ఆయా గ్రామాల ప్రజలు నూతన సర్పంచులను అభినందించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో బేగంపేట, కల్లేపల్లి గ్రామాలలో స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించి, యువతను ప్రోత్సహిస్తామని ఆయా గ్రామాల యువతకు హామీ ఇచ్చారు.

